కుదేలైన రైతులు



తిమ్మాపూర్ శివారులో దెబ్బతిన్న పత్తి పంట

- దెబ్బతిన్న పత్తి పంట
- ఎర్రతెగులు, గులాబీ రంగు పురుగు దాడి
- అప్పుల పాలవుతున్న అన్నదాతలు

అయిజ: వానాకాలంలో కురవాల్సిన వర్షాలు సకాలంలో కురవక పోవడం, అవసరమైనంత వర్షపాతం నమోదు కాకపోవడంతో ఈ యేడాది సాగుచేసిన పత్తి పంటలు బాగా దెబ్బతిన్నాయి. అవసరం లేని సమయంలో వర్షం అధికంగా కురవడం వల్ల పత్తి పంటలకు తెగుళ్లు, పురుగులు ఆశించి పంటలను దెబ్బతీశాయి. పత్తిని సాగు చేసిన కొన్ని రోజులకే ఎర్రతెగులు ఆశించి పత్తిపంట గిడుసబారింది. వాటిని తొలగించి రైతులు మళ్లీ పత్తి పంట సాగు చేశారు. వర్షాభావం వల్ల పంట ఎదుగుదల లోపించింది. గులాబీ రంగు పురుగు పత్తిపంటను ఆశించి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపించింది. ఎకరానికి సుమారు 20 క్వింటాళ్లు రావాల్సిన పత్తి 2నుంచి 5 క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. దీనివల్ల రైతులు అపారంగా నష్టపోయారు.

దళారులకు విక్రయిస్తున్న రైతులు..

మండలంలో సుమారు 59వేల ఎకరాలు పంట భూములున్నాయి. ఈ యేడాది 18వేల ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారు. పత్తిని చెట్టు నుంచి తొలగించేందుకు కూలీల కొరత ఉండడంతో ఒక్కొక్క కూలికి రూ.300 నుంచి రూ.400 చెల్లించాల్సి వచ్చింది. పత్తికి ప్రభుత్వం మద్దతు ధర రూ.7,022గా ప్రకటించింది. దళారులు పత్తిని రూ. 6,500 నుంచి రూ.7వేల వరకు కొనుగోలు చేస్తున్నారు.

పత్తి రైతులకు కష్టాలు..



ఈయేడాది పత్తిని సాగుచేసిన రైతులకు అన్ని కష్టాలమే మిగిలాయి. వర్షాకాలం ప్రారంభం నుంచి చివరి వరకు సరైన వర్షాలు పడలేదు. దాని వల్ల పత్తి మొక్కలు ఎదగ లేదు. దానికి తోడు ఎర్ర తెగులు ఆశించి పంట గిడుసబారింది. రైతులు పంటను తొలగించి మళ్లీ సాగు చేశారు. దీనివల్ల పెట్టుబడి ఎక్కువైంది. గులాబీ రంగు పురుగు ఆశించి దిగుబడి తగ్గిపోయింది. ప్రభుత్వం పత్తి రైతులను ఆదుకోవాలి

– సత్యారెడ్డి, రైతు, అయిజ

మూడేళ్లుగా నష్టాలే వస్తున్నాయి..



పత్తి పంటను సాగుచేసి రైతులకు మూడేళ్లుగా నష్టాలే వస్తున్నాయి. అధిక ధరలకు విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేసినా దిగుబడి పెరగడం లేదు. ఈ ఏడాది పత్తి ధర తక్కువ ఉంది. గతేడాది రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు ధర పలికింది. ఈయేడాది రూ.6 వేల నుంచి రూ. 7 వేలు మాత్రమే ధర పలుకుతోంది. ప్రభుత్వమే రూ.10 వేల కు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి.

– దేవేంద్ర, రైతు, సింధనూరు

జాగ్రత్తలు తీసుకోవాలి



రైతులు పండించిన పత్తిలో నాణ్యత ఉన్నది, నాణ్యత లేని పత్తిని వేరు వేరుగా విక్రయించుకోవాలి. తేమశాతం ఎక్కువ ఉన్న పత్తిని ఎండలో ఆరబెట్టుకోవాలి. రెండు రకాల పత్తిని వేరు వేరుగా విక్రయించాలి. ముఖ్యంగా గొగ్గి (విచ్చుకోని) పత్తిని వేరు చేయాలి. దళారులకు విక్రయిస్తే రైతులు మోసపోతారు. త్వరలో సీసీఐ కేంద్రం ఏర్పాటు చేసే అవకాశం ఉంది. రైతులు అక్కడ పత్తిని విక్రయించుకోవాలి.

– శంకర్‌లాల్, వ్యవసాయ అధికారి, అయిజ

సీఎం సహాయ నిధితో సహకారం

- ఎమ్మెల్యే వీఎం అబ్రహం



బాధిత కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే అబ్రహం

అలంపూర్: ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం పొందుతున్న వారిని సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థికంగా సహకారం అందిస్తామని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. మానవపాడు మాజీ ఎంపీపీ ప్రకాష్‌గౌడ్ కుమారుడు కర్నూల్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండటంతో ఎమ్మెల్యే పరామర్శించారు. అయిజ చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు అంజి తల్లి ఆస్పత్రిలో ఉండడంతో వారిని పరామర్శించారు. రాజోలి మండలం ముండ్లదిన్నెకు చెందిన మాజీ సర్పంచ్ లక్ష్మన్న మనవడు మరో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడంతో అక్కడి వెళ్లి పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి చికిత్స పొందుతున్న వారి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం అక్కడి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

మల్దకల్‌లో పోలీసుల కవాతు



మల్దకల్‌లో సీఆర్పీఎఫ్ పోలీసుల కవాతు

మల్దకల్: మండలంలోని ఎల్కూర్, మల్దకల్ గ్రామాలలో మంగళవారం ఎస్ఐ కళ్యాణ్‌కుమార్ అధ్వర్యంలో సీఆర్పీఎఫ్ పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకొనేందుకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆయా గ్రామాల్లోని పురవీధుల గుండా 60 సీఆర్పీఎఫ్ పోలీసులు తిరుగుతూ ప్రజల్లో భయాన్ని తొలగించారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

నవధాన్యాల మొలకల నిమజ్జనం



గట్టులో నవ ధాన్యాల మొలకల ఊరేగింపు



పెంచికలపాడులో బతుకమ్మలతో మహిళలు

గట్టు: దసరా పండుగను మండలంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని భవానీ ఆలయం పక్కన ఉన్న శేషంబావిలో నవధాన్యాల మొలకలను నిమజ్జనం చేశారు. దేవీ నవరాత్రుల్లో భాగంగా ఎఎస్‌కే సమాజ్ తొమ్మిది రోజుల పాటు నియమ నిష్టతో నవ ధాన్యాల మొలకలను పెంచి, విజయ దశమి పండుగ రోజు గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. భవానీ ఆలయం పక్కనున్న పురాతన కాలం నాటి శేషంబావిలో నవధాన్యాల మొలకలను నిమజ్జనం చేశారు. సాయంత్రం భవానీ దేవాలయం పక్కనున్న జమ్మి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఏఎస్‌కే సమాజ్ సంఘం అధ్యక్షుడు పెద్ద అంబుసా, సంఘం నాయకులు పాపురం వెంకటేష్, గోవిందు, చంద్రమోహన్, లక్ష్మన్న, వినోద్‌కుమార్, మహిళలు పాల్గొన్నారు. ఆరగిద్దలో పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకటేష్, సర్పంచ్ యోగేశ్వరిల ఆధ్వర్యంలో జమ్మిచెట్టుకు పూజలు చేశారు.

బతుకమ్మ సంబరాలు

గట్టు: మండలంలోని పెంచికలపాడులో దసరా పండుగ సందర్భంగా బసవన్న దేవాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. శమీ వృక్షానికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు తిరొక్క పూలతో బతుకమ్మను తయారు చేసి, సంబరాలు చేశారు.

కలిసికట్టుగా పనిచేయాలి



మాచర్లలో కార్యకర్తలతో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీధర్‌గౌడ్

గట్టు: బీఆర్‌ఎస్ అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి గెలుపు కోసం కార్యకర్తలు కలసికట్టుగా పనిచేయాలని గద్వాల మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీధర్‌గౌడ్ కోరారు. మంగళవారం మాచర్లలో సర్పంచ్ సిద్దిరామప్ప ప్రారంభించిన బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీధర్‌గౌడ్ పరిశీలించారు. కార్యకర్తలతో సమావేశయ్యారు. కార్యక్రమంలో సర్పంచ్ సిద్ధిరామప్ప, బీఆర్‌ఎస్ నాయకులు మోహన్‌గౌడ్, రాముానాయుడు, కృష్ణ, వెంకటేష్, మునిచందర్‌గౌడ్, మురళీకృష్ణగౌడ్, చాంద్ పాషా, రాజుగౌడ్, ఆనంద్, ముక్కెరయ్య, ఆంజనేయులు, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న జోగుల రవి

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రానికి చెందిన పోతుల జయన్న రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న అలంపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జోగుల రవి, కాంగ్రెస్ నాయకులతో కలిసి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం దహనం సంస్కారాలకు రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట వీరన్న, వెంకటన్న ఉన్నారు.

బ్రహ్మోత్సవాల్లో శ్రీవారికి చక్రస్నానం



స్వామివారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

అయిజ: పట్టణ శివారులోని బింగుదొడ్డి చెరువు పక్కన వెలసిన స్వయంభు కట్టకింద తిమ్మప్ప స్వామి ఆలయంలో నవరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం వేదపండితులు వేంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహానికి చక్రస్నానం చేయించారు. స్వామివారి నామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఆలయ కమిటీవారు భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు, భోజన వసతి కల్పించారు.

అంత్యక్రియలకు సాయం

అయిజ: మండలంలోని వేణు సోంపురానికి చెందిన జీవన్ కుమార్(38) గత శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి, చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మంగళవారం బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు అంత్యక్రియలకు ఆర్థికసాయం అందించారు. వారి వెంట అలంపూర్ నియోజకవర్గ ఇంచార్జ్ మధుగౌడ్, తిమప్ప, ఆనంద్ రాజు, బుడ్డన్న,సురేందర్ ఉన్నారు.

ఉద్యోగాలు సాధించిన యువకులకు సన్మానం



గట్టులో సన్మానం పొందిన యువకులు

గట్టు: పోలీస్ ఉద్యోగాలు సాధించిన యువకులను మంగళవారం ఘనంగా సన్మానించారు. మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ కండక్టర్ భరత్‌కుమార్, గ్రామ స్వరాజ్యం కమ్యూనిటీ ఆర్గనైజేషన్ వారు కలిసి పోలీస్ ఉద్యోగాలు సాధించిన యువకులను శాలువా, పూల మాలలతో సన్మానించారు. మల్లేష్(సివిల్), ఉదయ్‌కుమార్ (సివిల్) రాజ్‌కుమార్(ఫైర్), వీరేందర్ సాగర్(బెటాలియన్), రామాంజనేయులు (బెటాలియన్), అంజనేయులు (బెటాలియన్) పోలీస్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కృష్ణ, వార్డు సభ్యుడు కమ్మరి రమేష్, బజారి, అశోక్, సంఘం చంద్రశేఖర్, నాగప్ప, నర్సింహులు, ఉరుకుంద, గొల్ల నర్సింహులు, గ్రామ స్వరాజ్యం అధ్యక్షుడు రా జుసాగర్ పాల్గొన్నారు.

ఘనంగా విజయదశమి వేడుకలు

- ఆలయాల్లో భక్తుల సందడి
- జమ్మి వృక్షానికి ప్రత్యేక పూజలు
- శరన్నవరాత్రి వేడుకలు ముగింపు
- అమ్మవారి నిమజ్జనం



గద్వాలలో నిమజ్జనానికి తరలుతున్న దుర్గామాత



శాంతినగర్‌లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మహిళలు



మల్దకల్‌లో స్వామి వారి పల్లకీసేవలో భక్తులు

గద్వాల: గద్వాలలో విజయదశమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భారతంలో అర్జునుడు చేసిన శమీ పూజలు గుర్తు చేసుకుంటూ పూజలు చేశారు. శమీ ఆకు(బంగారం) ఇచ్చి ఒకరికొకరు పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

కన్నుల పండువగా నిమజ్జనోత్సవం

దేవీ శరన్నవరాత్రుల్లో విశేష పూజలందుకున్న దుర్గామాత నిమజ్జనోత్సవం జిల్లా కేంద్రంలో సోమ, మంగళవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. దుర్గామాత విగ్రహాలను సోమవారం రాత్రి ఊరేగించారు. అమ్మవారి శోభయాత్రలో వాయిద్యకారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చెన్నకేశవస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి అమ్మవారి శోభయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

ఎర్రవల్లిచౌరస్తా: శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా ముగిశాయి. చివరిరోజు బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో మహిషాసురమర్దిని అలంకరణలో దుర్గాదేవి, సరస్వతీ ఆలయంలో గజలక్ష్మి అలంకరణలో సరస్వతీదేవి భక్తులకు దర్శనమిచ్చింది. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఆయా ఆలయాల్లో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎర్రవల్లి, ఇటిక్యాల మండలాల్లోని పండగను ఘనంగా జరుపుకున్నారు. బీచుపల్లి ఆంజనేయ స్వామి ఆలయం, గ్రామాల్లోని ఆలయాల ముందు వాహనాలకు పూజలు నిర్వహించారు.

ధరూరు: పెద్ద చింతరేవుల ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు. ఆలయం వద్ద నుంచి దశమి కట్ట వరకు పల్లకీసేవ నిర్వహించా రు.

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని గ్రామాలు, మున్సిపాలిటీ పరిధిలో జమ్మిఆకుతో దేవతామూర్తులకు, పెద్దలకు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం సాయంత్రం శమీ వృక్షం వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం కన్యకాపరమేశ్వరి ఆలయం నుంచి రామాలయం వరకు అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగించారు.

ఉండవెల్లి: జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అనుసూయ మ్మ కాలనీలో, కంచుపాడులో అమ్మవారిని నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో అర్చకులు ఉన్నారు.

మల్దకల్: మండలంలో శమీ వృక్షానికి పూజలు చేశారు. మల్దకల్ పోలీసుస్టేషన్‌లో ఎస్ఐ కళ్యాణ్‌కుమార్ సిబ్బంది ఆయుధాలకు అర్చకులతో ప్రత్యేక పూజలు చేయించారు. ఆదిశిలాక్షేత్రంలో స్వామి వారి పల్లకీసేవ నిర్వహించారు. అనంతరం ఎంపీపీ రాజారెడ్డి, జెడ్పీటీసీ ప్ర భాకర్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు తిమ్మారెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

రైల్వే స్టేషన్‌లో భక్తుల కిటకిట

ఉండవెల్లి: మండలంలోని జోగుళాంబ రైల్వేహాల్ట్‌లో ప్రయాణికులు అధికంగా ఉండడంతో రైల్వే స్టేషన్ కిటకిటలాడింది. మంగళవారం సాయంత్రం ప్రయాణికులు, ఉద్యోగులు అధికంగా ఉన్నారు. హై లెవల్ ఫ్లాట్‌ఫాంను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అయిజ: పట్టణంలోని కాళికాదేవి, శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి, అంబా భవానీ ఆలయాల్లో భక్తులు భక్తి శ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలు నిర్వహించారు. సోమవారం వివిధ ఆలయాల్లో అమ్మవార్లను వివిధ రూపాలలో అలంకరించి ముగింపు పూజలు చేశారు.

కేటీదొడ్డి: దసరా పండుగ వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. శ్రీపాగుంట లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో రథోత్సవం నిర్వహించారు. అంజనేయస్వామి ఆలయంలో, వివిధ గ్రామాల్లో జమ్మిచెట్టుకు పూజలు చేసి జమ్మి ఆకు తీసుకొచ్చి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.



పాగుంటస్వామి ఆలయంలో రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు



గజలక్ష్మి అలంకరణలో సరస్వతీదేవి



మహిషాసురమర్దిని అలంకరణలో దుర్గాదేవి



బీచుపల్లిలో ఆంజనేయస్వామి ఆలయంలో భక్తులు



కిష్టాపురంలో రాజారాజేశ్వరి అమ్మవారికి పూజలు



పెద్ద చింతరేవులలో పల్లకీ సేవలో..



జోగుళాంబ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులు

క్లుప్తంగా

ఉత్సాహంగా సందెపురాళ్ల పోటీలు



ధరూరు: మండలంలోని ఓబులోనిపల్లిలో దసరా పండుగ సందర్భంగా సందెపురాళ్లు ఎత్తే పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన యువకులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. మొదటి విజేతగా రవి రూ. 3,500, ద్వితీయ బహుమతి రూ.2,500, తృతీయ బహుమతి రూ.2వేలు, నాలుగో బహుమతి రూ.1500 అందజేశారు.

హైమాస్ట్ లైట్ల పంపిణీ

మానవపాడు: గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని 7వ, వార్డు మెంబర్ ఆర్ నరసింహ నాయుడు అన్నారు. సోమవారం మండలంలోని చెన్నిపాడులో హైమాస్ట్ లైట్లు పంపిణీ చేశారు. 7వ వార్డులో 7 హైమాస్ట్ లైట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎర్రమద్దిలేటి, వకీల్ లక్ష్మన్న, చంద్రశేఖర్, పురుషోత్తం నాయుడు, శంకర్, ఎలక్ట్రిషిన్ శేఖర్, మధునాయుడు, మహేందర్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తా..



కేటీదొడ్డి: క్రీడాకారులకు ఎల్లప్పుడు తన ప్రోత్సాహం ఉంటుందని బీఆర్‌ఎస్ నాయకుడు గోపి అన్నారు. మంగళవారం మండలంలోని వెంకటాపురంలో క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. మానవ జీవితంలో క్రీడలు ఎంతో ప్రధానమని, క్రీడలు లేకుండా ముందుగా సాగలేరని అన్నారు. కార్యక్రమంలో యువత పాల్గొన్నారు.

ప్రమాదకంగా కల్వర్టు



మల్దకల్: మండలంలోని కుర్తిరావుల్‌చెర్వు, మల్దకల్ గ్రామాల మధ్య నాగర్‌దొడ్డి రిజర్వాయర్‌కు వెళ్లే ప్రధాన కాల్వపై ఏర్పాటు చేసిన కల్వర్టుకు రక్షణ గోడకూలి ప్రమాదకంగా మారింది. మూడేళ్ల క్రితం కూలిన రక్షణ గోడకు అధికారులు మరమ్మత్తులు చేయకపోవడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. నిరంతరం కాల్వలో నీరు ప్రవహిస్తుండటంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, ప్రయాణికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కూలిన కల్వర్టు రక్షణగోడకు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

వాహనాల తనిఖీ



కేటీదొడ్డి: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో పోలీసులు వాహనాలు ముమ్మరంగా తనిఖీ చేపట్టారు. మంగళవారం మండలంలోని రాష్ట్ర సరిహద్దు నందిన్నె చెక్ పోస్టు వద్ద ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ పోలీసుల ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కర్ణాటక రాష్ట్రాల నుంచి తెలంగాణకు మద్యం, డబ్బు రాకుండా అధికారులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఐటీబీపీ పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అనుమానాస్పద మృతి

గద్వాల క్రైం: వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం గద్వాల పట్టణ శివారులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మల్దకల్ మండలానికి చెందిన తిరుమలచారి(28) కొంత కాలంగా పట్టణంలోని షెరిల్లీవీధిలోని అద్దె ఇంట్లో ఉంటున్నాడు. మంగళవారం మధ్యాహ్నం ధరూర్ మెట్ కాలనీలోని మద్యం దుకాణం సమీపంలో మద్యం తాగి స్పృహతప్పి పడిపోయాడు. దీన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పట్టణ ఎస్ఐ శ్రీకాంత్ సిబ్బందితో అక్కడికి చేరుకుని పరిశీలించారు. ఎలాంటి చలనం లేకపోవడంతో మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై తిరుమలచారి తండ్రి పెద్ద నర్సింహాచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహంపై గాయాలు ఉండడంతో ఎవరైనా హత్య చేశారా? అనే అనుమానం వ్యక్తం చేశారు.

మొబైల్ షాప్ ప్రారంభం

ధరూరు: మండల కేంద్రంలో చైత్ర మొబైల్ షాప్‌ను ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి ప్రారంభించారు. కార్యక్రమంలో నిర్వాహకులు అశోక్‌రెడ్డి, నాయకులు సత్యనారాయణరెడ్డి, విజయ్‌రెడ్డి, మహిళా నాయకురాలు రాధమ్మ, రాధ తదితరులు పాల్గొన్నారు.